క్లుప్తంగా

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం బుధవారం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: 11కేవీ గొరపల్లి ఫీడర్‌లో నిర్వహణ పనులకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏఈ బోకం రవి తెలిపారు. గొరపల్లి, కరకవానిపాలెం, కోట్నివానిపాలెం, గవరపాలెం, గొల్లలపాలెం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

11కేవీ గుర్రంపల్లి ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ పెందుర్తి ఏఈ శ్యామ్‌సుందర్ తెలిపారు. సరిపల్లి, రాయవరపువానిపాలెం, జంగాలపాలెం, చిక్కాలపేట, నీలకంఠాపురం, అప్పన్నపాలెం ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

వీధి కుక్కల బెడద



గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు

పరవాడ: దేశపాత్రునిపాలెంలో వీధి కుక్కల బెడద అధికమైంది. రహదారులు, కూరగాయల మార్కెట్లు, మాంసం, చేపల దుకాణాలు, పాఠశాలల వద్ద విచ్చల విడిగా సంచరించడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పరవాడ–గాజువాక రహదారిలో దేశపాత్రునిపాలెం వద్ద గ్రామ సింహాలు రోడ్లపై మాటు వేసి వాహనదారులను వెంబడించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. కుక్కల వల్ల పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు భయపడుతున్నారు. రాత్రి సమయంలో వీధుల వెంట సంచరిస్తూ అరుపులు కేకలతో కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులను కోరినా ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు.

భెల్ కార్మికుల ఆందోళన

అక్కిరెడ్డిపాలెం: భెల్ యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు బుధవారం ఆందోళన చేపట్టాయి. యూనియన్ అధ్యక్షుడు అలమండ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భెల్ యాజమాన్యం ఎస్ఐపీ, పీపీపీలను ఉద్దేశపూర్వకంగానే అమలు చేయడం లేదని ఆరోపించారు. త్వరలోనే జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, వీటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పనిదినాల అమలు చేయాలని, మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు. సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

20న అప్రెంటిస్‌షిప్ మేళా

పెదగంట్యాడ: ఐటీఐలో వివిధ ట్రేడులను పూర్తి చేసుకున్న ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థుల కోసం ఈ నెల 20న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నామని ప్రభుత్వ ఐటీఐ స్టీల్ సిటీ ప్రిన్సిపాల్ లండా సుధాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీలో ఆ రోజు ఉదయం 9.30 గంటలకు మేళా ప్రారంభం కానుందని, మొత్తం 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు రెండు సెట్లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు http://www.apprenticeshipindia.gov.in/mela నందు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- డీఆర్‌జే కళాశాలా... మేజర్ డిఫెన్స్ అకాడమీనా...
- కేంద్రం పేరు ఒకలా...భవనంపై పేరు మరోలా
- గందరగోళంలో విద్యార్థులు



పెందుర్తి ప్రభుత్వ కళాశాల వద్ద పరీక్ష రాసి బయటకి వస్తున్న విద్యార్థులు

సింహాచలం: ఇంటర్ పరీక్షలు తొలిరోజు సోమవారం పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. నిఘా నీడలో పరీక్షలు నిర్వహించారు. అధికారులు ఆయా కేంద్రాలను సందర్శించారు. పలు సూచనలు చేశారు.

పెందుర్తిలో నాలుగు కేంద్రాల్లో జరిగాయి.నగరంలోని పలు కళాశాలకు చెందిన విద్యార్థులకు పెందుర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలాజీ జూనియర్ కళాశాల, డీఆర్‌జే కళాశాల, ఆర్ఆర్ వెంకటాపురంలోని ఎస్‌వీఎల్ఎన్ కళాశాలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. ఆయా కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 7.30గంటల నుంచే చేరుకున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరిగింది.

డీఆర్‌జే కళాశాల పేరుతో తికమక

కాగా డీఆర్‌జే కళాశాల కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు తికమక పడ్డారు. పలువురు విద్యార్థులకు పెందుర్తి నుంచి ఆనందపురం వెళ్లే మార్గంలో రాజయ్యపేటకు సమీపంలో ఉన్న డీఆర్‌జే కళాశాలను కేటాయించారు. విద్యార్థులకు డీఆర్‌జే కళాశాల అనే ముందుగా తెలిపారు. తీరా కళాశాల వద్దకు వెళ్తే అక్కడ కళాశాల భవనంపై మేజర్ డిఫెన్స్ అకాడమీ అని ఉండడంతో గందరగోళానికి గురయ్యారు. పలువురు విద్యార్థులు భయభ్రాంతులు చెందారు. ఆసమీపంలోనే డీఆర్‌జే కళాశాలకు వెళ్లే మార్గం అని బోర్డు పెట్టి ఉండటంతో ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడ్డారు. ఈతరుణంలోనే డీఆర్‌జే కళాశాల, మేజర్ డిఫెన్స్ అకాడమీ కళాశాల రెండు ఒక్కటే అని పలువురు ద్వారా తెలుసుకుని కేంద్రానికి పరుగులు తీశారు. ఈవిషయంలో తప్పు ఎవరిదో తెలియని పరిస్థితి నెలకుంది. ఇదిలావుండగా పెందుర్తి నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు పలువురు విద్యార్థులు నడుచుకుంటూనే వెళ్లారు.



ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన డీఎస్పీ శ్రీనివాసరావు

తొలి రోజు ప్రశాంతం

సబ్బవరం: మండలంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు తొలిరోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. సబ్బవరం జూనియర్ కళాశాలలో 410 మందికిగాను 382 మంది విద్యార్థుర్దులు హాజరు కాగా 27 మంది గైర్హాజరయ్యారు. తెలుగు సబ్జెక్టు విద్యార్థులు 77 మందికి 70 మంది, సంస్కృతం పేపర్‌కు 22 మందికి 21 మంది ,జనరల్ ఫౌండేషన్ కోర్స్ పేపర్‌కు 311 మందికి గానూ 292 మంది హాజరయ్యాని చీఫ్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ కేశవరావు తెలిపారు. అదేవిధంగా గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో 268 మందికి గానూ 257 మంది విద్యార్థులు హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారు.

పరవాడలో..

పరవాడ: ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు తానాం రెసిడెన్సియల్ కళాశాల, అచ్యుతాపురం ప్రశాంతి జూనియర్ కళాశాల, ఇస్లాంపేట జూనియర్ కళాశాలల నుంచి విద్యార్థులు 425 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 16 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. మొదటి సంవత్సరం పరీక్షలు 409 మంది విద్యార్థులు రాశారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎన్‌డీఎల్ కుమారి చెప్పారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పరీక్షా కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఆయన వెంట సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ మల్లేశ్వరరావు ఉన్నారు. గురువారం 422 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయనున్నారని సూపరింటెండెంట్ లలిత కుమారి చెప్పారు.



డీఆర్‌జే కళాశాలకు బదులు మేజర్ డిఫెన్స్ అకాడమీ అని ఉన్న కేంద్రం



డీఆర్ జూనియర్ కళాశాల అని సూచిస్తూ ఏర్పాటు చేసిన బోర్డు



పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

క్షయ వ్యాధికి ఉచిత వైద్యం

డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

ఆరిలోవ: ఆరిలోవలో బుధవారం ఎన్‌టీఈపీ, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు క్షయ వ్యాధి నివారణ కోసం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి ఆరిలోవ కాలనీలో యూపీహెచ్‌సీ వద్ద సైకిల్ ర్యాలీ చేపట్టారు. దుర్గాబజార్, ఆపరేషన్ కాలనీ మీదుగా తిరిగి ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వద్దకు చేరుకొంది. అక్కడ వారంతా మానవ హారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఎంహెచ్‌వో డాక్టర్ బి.జగదీశ్వరరావు మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన వారికి జిల్లాతోపాటు నగరంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందుబాటులో ఉందన్నారు. క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇటీవల అందుబాటులోకి వచ్చిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల్లో సైతం క్షయ వ్యాధి నివారణకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్షయ అంటువ్యాధని, ఇది ఉన్న వారు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు ఇతరులకు సోకుతుందన్నారు. డీటీసీవో డాక్టర్ పుత్సందరరావు మాట్లాడుతూ జిల్లాలో 1,300 మంది క్షయ వ్యాధితో బాధపడుతున్నారని వెల్లడించారు. వారందరికీ మందులు, వైద్యం ఉచితంగా అందిస్తున్నామన్నారు. నిశ్చయ పోషణ ద్వారా డ్రై రేషన్ ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, జిత్ ఎన్‌జీవోలు, ఏఎన్ఎంలు, ఎన్‌టీఈపీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వద్ద మానవ హారం నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు

టెన్త్ విద్యార్థి అదృశ్యం



జ్ఞానసాయివర్మ

టీచ్‌రోడ్డు: పదో తరగతి విద్యార్థి అదృశ్యమైన ఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 28వ వార్డు ఊటగెడ్డ ప్రాంతానికి చెందిన మద్దల రామరాజు, రోజా దంపతుల కుమారుడు మద్దల జ్ఞాన సాయివర్మ కేడీపీఎం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం 8.45 గంటలకు స్కూల్‌కు వెళ్లిన జ్ఞానసాయి రాత్రి 8 వరకు ఇంటికి రాలేదు. విద్యార్థి స్నేహితులను, కుటుంబ సభ్యులను విచారించిన ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకతాయిల దాడులను అరికట్టండి


మద్దిలపాలెం: ప్రజా రవాణ వ్యవస్థలో పనిచేసే ఉద్యోగులపై అమానుషంగా దాడులకు పాల్పడిన ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ దాడులను ఖండించాలని కోరుతూ బుధవారం మద్దిలపాలెం విశాఖ రూరల్ డిపో వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.సూర్యనారాయణ, కార్యదర్శి సీతాలక్ష్మి మాట్లాడుతూ డిపో ప్రాంగణంలో ఇలాంటి ఘటనల జరగడం దురదృష్టకరమన్నారు. డిపో ఎదురుగా వున్న బస్టాప్ నిరుపయోగంగా ఉండడం వలన ఆకతాయిలకు అడ్డాగా మారిందన్నారు. ఇలాంటి సంఘటనలు సిబ్బంది ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీయస్తున్నాయన్నారు. వీటిపై డిపో యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్క్ ఫెడరేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మద్దిలపాలెం డిపో వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కార్మిక శాఖ అధికారి దృష్టికి సమస్యలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ఉక్కు శ్రామిక సంఘం నాయకులు కేంద్ర కార్మిక శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.ఎస్. మధును కోరారు. స్టీల్‌ప్లాంట్‌కు బుధవారం విచ్చేసిన మధును నాయకులు కలిసి, సమస్యలను వివరించారు. మూడు నెలలుగా నిర్వాసిత కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని, చాలామందికి పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదని చెప్పారు. కర్మాగారం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి కాంట్రాక్ట్ కార్మికులుగా ఉపాధి పొందుతున్నారని, వారికి ఉక్కు యాజమాన్యమే నేరుగా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డు పైడిరాజు, కరణం సత్యారావు, బి. శివరాజేష్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర కార్మికశాఖ అధికారి మధుకు సమస్యను వివరిస్తున్న నాయకులు

బ్యాడ్మింటన్ క్రీడాకారుడు లింగేశ్వరరావుకు వీడ్కోలు

ఉక్కునగరం: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు లింగేశ్వరరావుకు ఉక్కు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. స్టీల్‌ప్లాంట్ క్రీడా ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న లింగేశ్వరరావు ఉద్యోగానికి రాజీనామా చేశారు. దీంతో ఉక్కు స్టేడియంలోని క్రీడా విభాగంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, మాజీ జీఎం ఎం.ఎస్. కుమార్ హాజరై లింగేశ్వరరావుకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేశారు. వారు మాట్లాడుతూ లింగేశ్వరరావు అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విజయాలు స్టీల్‌ప్లాంట్‌కు గర్వకారణమన్నారు. ఆయన భవిష్యత్తు ప్రణాళికలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



లింగేశ్వరరావును సత్కరిస్తున్న సీజీఎం ప్రకాశ్, మాజీ జీఎం కుమార్

గృహ నిర్మాణాలు వేగవంతం

సబ్బవరం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు అర్బన్ హౌసింగ్ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ విజిలెన్స్,క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ కె. రామచంద్రన్ సూచించారు.మండలంలోని పైడివాడ అగ్రహారం లేఅవుట్‌లో చురుగ్గా సాగుతున్న గృహ నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ నెలాఖరుకు గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని లే అవుట్ ఇన్‌చార్జి, లబ్ధిదారుల తరపున గృహ నిర్మాణాలు చేపడుతున్న ప్రతాప్‌ను ఆదేశించారు. ప్లింత్ భీమ్‌ల నాణ్యతను పరిశీలించారు.ఈ నెలాఖరుకు కనీసం 100 ఇళ్లు పూర్తిచేయడం లక్ష్యంగా పనిచేయాలన్నారు. ల్యాబ్‌లలో క్యూబ్స్ కంప్రెసీవ్ స్ట్రెంత్ పరీక్షలు చేశారు. ఈఈ ప్రసంగరాజు, క్వాలిటీ కంట్రోల్ డీఈఈ సుబ్రహ్మణ్యం, ఏఈ గోపాలకృష్ణ, లే అవుట్ ఇన్‌చార్జిలు ప్రేమ్,యువ,శివ,వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జగనన్నకాలనీలో సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎస్ఈ రామచంద్రన్ తదితరులు

తైక్వాండో జాతీయ పోటీలకు మధురవాడ క్రీడాకారులు

మధురవాడ: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు మధురవాడకు చెందిన 10 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల యలమంచిలిలో సబ్ జూనియర్ క్యాడెట్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. వీటికి మధురవాడ నుంచి 14 మంది క్రీడాకారులు హాజరుకాగా 10 మంది బంగారు, ఒకరు కాంస్య పతకం సాధించారు. వీరిలో 10 మంది ఈ నెల 28 నుంచి 31 వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మధురవాడ యూత్ తైక్వాండోకు చెందిన జి.భాషిత, ఎ.నిత్యశ్రీ, పి.జ్ఞానశ్రీ, కె.ధనలక్ష్మి, కె.మహేశ్వరరావు, పి.సుధీర్, ఎస్.విశాల్, పి.జశ్వంత్ సాయిసూర్య, ఎ.వివేక్ అభిసాయి, టి.మణికంఠ బంగారు పతకాలు గెలుచుకున్నారు. పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మధురవాడకు చెందిన శ్రీ కనక దుర్గా క్యాటరింగ్ అండ్ సప్లయిర్స్ నిర్వాహకులు కొర్రాయి సురేష్ ఆర్మ్ గార్డ్స్, చికెస్ గార్డ్స్ బుధవారం బహూకరించారు. విజేతలను మధురవాడ యూత్ తైక్వాండో కోచ్‌లు సురేష్, సుకుమార్, సంపత్ తదితరులు అభినందించారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అతిథులు, కోచ్‌లు

కోరాపుట్–కొత్తవలస లైన్‌లో తనిఖీలు

- అభివృద్ధి పనులు పరిశీలించిన జీఎం మనోజ్‌శర్మ

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ రెండో రోజు బుధవారం కూడా వాల్తేర్ డివిజన్ పరిధిలో గల కోరాపుట్ – కొత్తవలస లైన్లో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సెక్షన్ పరిధిలో కోరాపుట్, అరకు, బొర్రా గుహలు, శివలింగపురం స్టేషన్ల మధ్య సైడింగ్స్, రైల్వే కార్యాలయాలు, స్టేషన్లను తనిఖీ చేశారు. విండో ట్రెలింగ్ తనిఖీల ద్వారా మలుపులు, వంతెనలు, పాయింట్స్ అండ్ క్రాసింగ్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. కోరాపుట్ – కొత్తవలస సెక్షన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనులు, కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో గల రన్నింగ్ రూం, రెస్ట్ హౌస్‌లను పర్యవేక్షించారు. అనంతరం రన్నింగ్ రూంలో లోకో పైలట్స్, ట్రైన్ మేనేజర్స్‌తో మాట్లాడారు. అరకు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన వన్‌స్టేషన్ – వన్ ప్రాడక్ట్ స్టాల్‌ను, రెస్ట్‌హౌస్‌లను కూడా పరిశీలించారు. అమృత్‌భారత్ పథకం కింద ఈ స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. చిమిడిపల్లి వద్ద గల టన్నెల్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇటీవల గూడ్స్ రైలు ప్రమాదం జరిగిన శివలింగపురం యార్డ్‌ని పరీక్షించారు. పర్యటనలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



శివలింగపురం స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న జీఎం మనోజ్ శర్మ, డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

సెయిల్‌లో విలీనంతో స్టీల్‌ప్లాంట్‌కు భవిష్యత్

ఎంపీలకు ఉక్కు అధికారుల సంఘం లేఖలు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా సెయిల్‌లో విలీనం చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ప్రైవేటీకరణ తప్పదని ప్రకటించిన నేపథ్యంలో బుధవారం సీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో లోకసభ, రాజ్యసభ ఎంపీలకు పెద్ద సంఖ్యలో లేఖలు రాశారు. ఆ లేఖల్లో ప్రైవేటీకరణ ప్రత్యామ్నాయం, సెయిల్‌లో విలీనం, వాటి ఉపయోగాలు, ఉక్కు పరిశ్రమ అభివృద్ధి, కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ లక్ష్య సాధన, ఉద్యోగాల కల్పన, రిజర్వేషన్లు అమలు వంటి అంశాలను వివరించారు. తక్కువ పెట్టుబడితో ఉక్కు సామర్థ్యం పెంపు గురించి లేఖల్లో వివరించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ మాజీ డైరెక్టర్ (ఆపరేషన్స్) కె.కె.రావు మాట్లాడుతూ విశాఖ ఉక్కుతో ఆంధ్రులకు చాలా అనుబంధం ఉందన్నారు. సెయిల్ నుంచి విడదీసిన విశాఖ ఉక్కును తిరిగి విలీనం చేయడం ద్వారా లాభదాయకమైన ఉత్పాదనకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్, ఉపాధ్యక్షులు చంద్ర వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి నరసింహతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఎంపీలకు రాసిన లేఖలను ప్రదర్శిస్తున్న మాజీ డైరెక్టర్ రావు, సీ ప్రతినిధులు

ముడసర్లోవకు హంగులు

- కొంగొత్తగా రూపుదిద్దుకుంటున్న ప్రాంతం
- ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ సందర్శనకు రానున్న విదేశీ అతిథులు
- వారిని ఆకట్టుకునేలా అధికారుల ఏర్పాట్లు
- మిలమిలా మెరిసిపోతున్న రహదారులు



డెబ్రిస్‌ను తొలగించి శుభ్రం చేసిన ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్లు



ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ వద్దకు వెళ్లే మార్గానికి రంగులు

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతానికి కొత్తదనం వస్తోంది. ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న జీ 20 సదస్సు నేపథ్యంలో నగరానికి విదేశీ అతిథులు రానున్నారు. వీరు ముడసర్లోవ రిజర్వాయర్‌లో జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను సందర్శించనున్నారు. దీనికి సంబంధించిన ప్రణాళికను కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ ఇప్పటికే సిద్ధం చేశారు. ఇటీవల జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ వేర్వేరుగా ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేయాలి, ఏవిధంగా రక్షణ చర్యలు చేపట్టాలో ప్రణాళిక రూపొందించారు. దీంతో అతిథులను ఆకట్టుకునేలా ఈ ప్రాంతాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా రిజర్వాయర్ వెనుక ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్నారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ వద్ద సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. జీవీఎంసీ అధికారులు కొన్ని రోజులుగా ఇక్కడ పనులు చేపడుతున్నారు. నిన్నటి వరకు గృహ వ్యర్థాలు, చెత్తతో నిండిపోయిన ఇక్కడి రోడ్లను పరిశుభ్రం చేయించారు. కుప్పలుగా నిండిపోయిన డెబ్రిస్‌ను తొలగించి రోడ్లను అద్దంలా తయారు చేస్తున్నారు.

ఆకర్షణీయంగా..

సుమారు నెల రోజుల కిందట ఇక్కడి జీవీఎంసీ ఖాళీ స్థలాలు చుట్టూ రక్షణ గోడలు నిర్మించారు. వాటికి ఇప్పుడు పెయింట్ వేసి అందంగా తయారు చేశారు. సోలార్ ప్లాంట్ ఆవరణలో రహదారులు, వాటికి ఇరు పక్కలా వివిధ ఆకర్షణీయమైన మొక్కలు నాటుతున్నారు. ముడసర్లోవ రిజర్వాయర్ నీటి మధ్యలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ వద్దకు చేరుకునే వంతెన లాంటి రహదారికి రంగులు వేసి రూపరేఖలు మార్చుతున్నారు. దీంతో హనుమంతవాక నుంచి రామకృష్ణాపురం వరకు రోడ్డు మధ్య డివైడర్లకు రంగులు, ఇరుపక్కలా గోడలకు వివిధ రకాల బొమ్మలతో ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు..

జీ–20 సదస్సుకు సుమారు 40 దేశాల నుంచి ప్రతినిధులు రానున్నట్లు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. రెండు రోజులు పాటు జరగనున్న ఈ సదస్సు అనంతరం ఈ నెల 30న సోలార్ ఫ్లోటింగ్ ప్లాంట్‌ను అతిథులు సందర్శించనున్నారు. ఈ మేరకు వారి కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అతిథులు ఇక్కడ విశ్రాంతి తీసుకోవడానికి ఆధునిక వసతులతో తాత్కాలికంగా టెంట్ హౌస్ నిర్మించనున్నారు. ఆఘమేఘాల మీద అన్ని హంగులతో ప్రత్యేకంగా ఆధునిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని వివిధ రకాల పూల మొక్కలు, పచ్చదనంతో సుందరీకరణ పనులు చేపడున్నారు. ఈ చర్యలతో ముడసర్లోవ ప్రాంతానికి మహర్దశ వచ్చిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.